# ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలుచేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్




వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతి కుమారి, పాల్గొన్న నిర్మల్, ఆదిలాబాద్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు

నిర్మల్ టౌన్, జూలై 3 : ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అన్ని జిల్లాల్లో పారదర్శకంగా అమలు చేస్తూ ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సోమవారం వీసీ నిర్వహించారు. నిర్మల్ కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా అధికారులు అంబాజీనాయక్, విజయలక్ష్మి, డీఆర్వో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తున్న నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లాలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలిచ్చే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. హరితహారం కింద ఆయాజిల్లాల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి రోజూ పర్యవేక్షించాలని పేర్కొన్నారు. వీటితో పాటు 'మన ఊరు మన బడి', ఉపాధిహామీ, సంక్షేమం, రైతుబంధు తదితర పథకాలపై సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలో బీసీ రుణాల ప్రక్రియను త్వరలో చేపట్టి లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణకు హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పోడు పట్టాలపై కసరత్తు చివరిదశకు చేరుకున్నదని, త్వరలోనే రైతులకు అందేలా చూస్తామని తెలిపారు. ఈ వీసీలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గిరిజనులకు విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- బాధ్యతల స్వీకరణ



ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్, జూలై 3 : గిరిజనులకు విద్య, వైద్యం అందించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో 61వ పీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుమ్రంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నందున గిరిజన సమస్యలు పూర్తిగా తెలుసన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. మంగళవారం స్థానిక కుమ్రంభీం ప్రాంగణంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోడు భూముల పట్టాలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లోని గిరిజనులకు అందుతున్న విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. సీఆర్టీల నియామకం త్వరలో పూర్తికానున్న నేపథ్యంలో విద్యావ్యవస్థ మరింత పటిష్టపడనున్నదన్నారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు విధులకు గైరాజరు కాకుండా మూమెంట్ రిజిస్టర్ అమలు చేస్తామని పేర్కొన్నారు. జీసీసీ పెట్రోల్ బంక్ నిర్వహణ సరిగా లేకపోవడంతో పెట్రోల్ దొరకక పడుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకరాగా, సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ పబ్లిసిటీ అధికారి విష్ణు, సిబ్బంది ఉన్నారు.

# రాష్ట్ర సంక్షేమం దేశానికే ఆదర్శం

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి
- పాక్‌పట్లలో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ
- రాహుల్ వ్యాఖ్యలపై మండిపాటు



సోన్ : కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

సోన్, జూలై 3 : తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో రూ.3.50కోట్లతో నూతనంగా నిర్మించిన 50 డబుల్‌బెడ్రూం ఇండ్లను సోమవారం మంత్రి ప్రారంభించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంక్షేమం దేశ ప్రజలు కోరుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు ఇక్కడ తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే ప్రసక్తి లేదని, వచ్చే ఎన్నికల్లో కూడా ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పి మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. 'జాతీయ కాంగ్రెస్ పార్టీకి ముఖ్య నాయకుడైన రాహుల్ గాంధీ అబద్ధాలు మాట్లాడవచ్చునా..? ఖమ్మం బహిరంగసభలో కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని కేసీఆర్‌పై విమర్శలు చేసిన్రు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.80వేల కోట్లయితే లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యం?' అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రశ్నించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ఖమ్మం బహిరంగసభలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చదివారే తప్పా ఆయనకు తెలంగాణపై ఏమాత్రం అవగాహన లేదని మండిపడ్డారు. అర్థం పర్థం లేని మాటలు మాట్లాడితే ప్రజలు విశ్వసించరని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై దేశంలో చర్చ జరుగుతున్నదని, అందుకే కేసీఆర్ 'అబ్‌కీ బార్.. కిసాన్ సర్కార్' నినాదంతో ముందుకెళ్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలోనే పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలంగా మర్చామన్నారు. కాళేశ్వరం నీటిని శ్రీరాం సాగర్‌కు మళ్లించే ప్రక్రియను ప్రభుత్వం చేపడుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధికి చేపట్టిన చర్యల కారణంగానే రాష్ట్రంలో పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండితే 27, 28 ప్యాకేజీ ద్వారా మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని మంత్రి భరోసానిచ్చారు. నిర్మల్ జిల్లాతో పాటు నిర్మల్ నియోజకవర్గంలో తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. సోన్ గ్రామం నుంచి గాంధీనగర్ గ్రామం వరకు రూ.14కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే మాదాపూర్‌లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. పాక్‌పట్ల గ్రామ సమీపంలో రూ.300 కోట్లతో 40 ఎకరాల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. దీంతో ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ఆర్థిక ప్రయోజనం కలుగనున్నదని చెప్పారు. ఈ ఫ్యాక్టరీ పూర్తయితే స్థానికులకు ఉద్యోగావకాశాలు కూడా వస్తాయన్నారు. గ్రామంలో ఏ సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని సూచించారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే కోరిక ఉంటుందని, దీన్ని ప్రభుత్వం నిరుపేదలకు నిర్మించి ఇవ్వడంతో వారి కలలు నెరవేరాయని పేర్కొన్నారు. అనంతరం లోకల్‌వెల్మల్ గ్రామ సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించి నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

### కుమ్రంభీం విగ్రహాల ఆవిష్కరణ..

సోన్ మండల కేంద్రంతో పాటు లోకల్ వెల్మల్ గ్రామంలో నిర్మించిన కుమ్రంభీం విగ్రహాలు, ఎస్టీ సంఘ భవనాన్ని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ సోన్ మండల కన్వీనర్ మోహినొద్దీన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు టీ వినోద్, సర్పంచ్‌లు ఎల్చల్ గంగారెడ్డి, కవిత రాజేశ్వర్, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మహేందర్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్, తహసీల్దార్ హిమబిందు, నిర్మల్ ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మధుకర్‌రెడ్డి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సాయారెడ్డి, ఎల్చల్ రమేశ్‌రెడ్డి, సుంచు శ్రీనివాస్, బండి లింగన్న, దాసరి శ్రీనివాస్, ప్రసాద్, జగన్, ఎస్టీ కుల సంఘ సభ్యులు, తదితరులున్నారు.

### ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నిర్మల్ అర్బన్, జూలై 3 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని గండిరామన్న దత్తసాయి ఆలయంలో మంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయానికి విచ్చేసిన మంత్రి దంపతులకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాలకు అధిక నిధులు ఖర్చు చేస్తున్నదని చెప్పారు. అనంతరం మంత్రిని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్లోల సురేందర్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ చైర్మన్ లక్కాడి జగన్మోహన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ఆమెడ శ్రీధర్, నందు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లోకి డీఆర్డీఏ కార్యాలయం

- పూజల్లో పాల్గొన్న కలెక్టర్, డీఆర్డీవో



కార్యాలయంలో పూజలు చేస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్ టౌన్, జూలై 3 : నిర్మల్ పట్టణంలోని ఎల్లపెల్లి శివారులో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ సమీకృత భవనంలో డీఆర్డీవో కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. సమీకృత భవనంలో జీ బ్లాక్ డీఆర్డీఏ కార్యాలయానికి భవనం కేటాయించారు. దీంతో డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం నుంచి కార్యాలయంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వరుణ్‌రెడ్డి హాజరయ్యారు. డీఆర్డీవో విజయలక్ష్మికి పుష్పగుచ్ఛం అందించి సీట్లో కూర్చోబెట్టారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ సిబ్బంది సాయిప్రసాద్, సుధాకర్, ఓస ప్రసాద్, బోసు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు పోస్టుల భర్తీకి ధ్రువీకరణ పత్రాల పరిశీలన

నిర్మల్ అర్బన్, జూలై 3 : సమగ్ర శిక్ష అభియాన్‌లో ఎమ్మార్సీల్లో వివిధ పోస్టుల భర్తీకి 2019 నవంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో భాగంగా ఖాళీల భర్తీకి పరీక్ష నిర్వహించారు. అర్హులైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను సోమవారం పరిశీలించారు. డీఈవో రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కో పోస్టు కోసం ముగ్గురిని ఎంపిక చేసి, వారికి సంబంధించి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. త్వరలోనే మెరిట్ ఆధారంగా సెలక్షన్ జాబితా విడుదల చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి